చెట్టే కదా అని కొట్టేస్తే..
చర్యలు తప్పవు..!

- చెట్ల సంరక్షణకు ఉపయోగపడుతున్న వాల్టా చట్టం
- నరికేస్తే భారీగా జరిమానా విధిస్తున్న అధికారులు
- మరింత అవగాహన కల్పించాలంటున్న ప్రజలు



బంజారాహిల్స్‌లో కొట్టేసిన భారీ వృక్షం

బంజారాహిల్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో చెట్ల సంరక్షణకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ చెట్టును కాపాడేందుకు వాల్టా చట్టానికి పదును పెడుతున్నారు. చెట్టే కదా అని కొట్టేస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. పార్కులో మొక్కను విరిచినా, ఇంట్లో చెట్టు కొమ్మలు కొట్టేసినా జరిమానా విధిస్తున్నారు. ఇటీవలి కాలంలో కేబీఆర్ జాతీయ ఉద్యానవనానికి సంబంధించిన అటవీ శాఖ అధికారులు ఇలాంటి ఫిర్యాదులతో అనేక కేసులు నమోదు చేస్తున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ డివిజన్లలో ఇలాంటి కేసులు అత్యధికంగా నమోదయ్యాయి.



జూబ్లీహిల్స్‌లో కొట్టేసిన చెట్టు కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయాలి..

వాల్టా చట్టం ప్రకారం ఎవరైనా తమ ఇంటి ఆవరణలోని చెట్టును తమంతట తాము నరికేయకూడదు. ఆ చెట్టువల్ల ఏమైనా ఇబ్బందులు ఎదురైతే విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. అధికారులు పరిశీలించి నిజంగానే సమస్య ఉన్నట్లయితే చెట్టును కొట్టేయడం లేదా అక్కడి నుంచి తొలగించి మరోచోట ఏర్పాటు చేస్తారు. ఒక చెట్టును తొలగించడానికి రూ. 500, ప్రాసెసింగ్ రసుము చెల్లించాల్సి ఉంటుంది. అలా కాదని నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానా వేలల్లో ఉంటుంది. అయితే వాల్టా చట్టం విషయంలో చాలా మందికి సరైన అవగాహన లేదు. చాలా మంది తమ ఇళ్లలో ఉండే చెట్లను కొట్టేస్తుంటారు. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 32లో ఉండే సమ్మిరెడ్డి తన ఇంటి ముందున్న మూడు చెట్లను విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయనే కారణంతో నరికేయించారు. దీంతో అతడికి అధికారులు జరిమానా విధించారు. అయితే ఇలాంటి చట్టం ఉందని తనకు తెలియకపోవడంతోనే చెట్లను కొట్టేసినట్లు సమ్మిరెడ్డి అధికారులతో అన్నాడు. కాగా, కేవలం చెట్లు, మొక్కలకే కాకుండా భూమి, నీటికి సైతం ఈ చట్టం వర్తిస్తుందని పశ్చిమ మండల ప్రాంతానికి చెందిన ఓ అటవీ శాఖ అధికారి తెలిపారు.

అవగాహన కల్పించాలి

వాల్టా చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అనేక బస్తీల్లో అవసరం లేకున్నా చెట్లను కొట్టేస్తున్నారు. జరిమానా విధిస్తారన్న విషయం తెలిస్తే చెట్లను కొట్టకుండా ఉంటారు.

- సుధాకర్, ఇందిరానగర్

వాల్టా చట్టంతో కాపాడుకునే అవకాశం

పచ్చదనం, చెట్ల వల్ల కలిగే ప్రయోజనాల గురించి మరింత అవగాహన పెరగాలి. కొత్త వాటిని ఎలాగో నాటడం లేదు. కనీసం ఉన్న చెట్లను నరికివేయకుండా కాపాడుకోవాలి. వాల్టా చట్టంతో కొంతమేరకు చెట్లను కాపాడుకునే అవకాశం ఉంది.

- రాకేష్, ఫిలింనగర్

జరిమానా విధించిన ఘటనల్లో కొన్ని..

- జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 76లో నివసించే ప్రసాద్ తన ఇంట్లోని సీతాఫలం చెట్లను కొట్టేయడంతో అటవీశాఖ అధికారులు అతడికి రూ.12 వేల జరిమానా విధించారు.
- బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లో ఓ వ్యాపారి తన ఇంటి ఆవరణలోని చెట్టు కొమ్మలను నరికేయడంతో రూ.10 వేల జరిమానా కట్టాల్సి వచ్చింది.
- గత ఏడాది బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని ఎన్‌బీటీనగర్‌లో నివసించే హేమలత ఇంటిపక్కనున్న చెట్టు కొట్టేయగా రూ.12 వేల జరిమానా విధించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రవీంద్ర నాయక్

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

- మాజీ మంత్రి రవీంద్ర నాయక్

పంజాగుట్ట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, కేంద్ర గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రవీంద్ర నాయక్ కోరారు. ఈ మేరకు ఇటీవల ఢిల్లీలో రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమంత్రి, గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రామరాజ్యం గురు సేవా సమితి ట్రస్టు అధ్యక్షుడు భీమా నాయక్, గిరిజన శక్తి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వెంకటేష్ చౌహాన్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.



ఎక్స్‌గ్రేషియా పత్రాన్ని అందజేస్తున్న ఈఆర్సీ చైర్మన్ టి.రంగారావు, సీఎండీ ముషారఫ్

బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన పి.యాదయ్య కుటుంబ సభ్యులకు టీఎస్‌ఈఆర్సీ చైర్మన్ టి.రంగారావు, దక్షిణ డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఎక్స్‌గ్రేషియా పత్రాన్ని బుధవారం అందజేశారు. యాదయ్య మరణించి మూడేళ్లు అవుతున్నా ఎక్స్‌గ్రేషియా అందలేదని రైతుసంఘం నాయకులు ఈఆర్సీ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన దక్షిణ డిస్కం సీఎండీ విచారణ చేపట్టి ఎక్స్‌గ్రేషియా ఆర్డర్ కాపీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ హరిప్రసాద్

సైరన్, బ్లాక్ ఫిల్మ్‌పై స్పెషల్ డ్రైవ్

బంజారాహిల్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా సైరన్, బ్లాక్ ఫిల్మ్‌లతో తిరుగుతున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. జూబ్లీహిల్స్‌లోని ఇంటర్నేషనల్ క్లబ్ వద్ద పశ్చిమ మండలం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా 40 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ హెగ్డే మాట్లాడుతూ.. ఈ డ్రైవ్ నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. అనుమతులు లేకుండా వాహనాలకు సైరన్లు, బ్లాక్ ఫిల్మ్‌లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కూరగాయలకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



రామ్ జతన్ చౌపాల్ (ఫైల్)

బౌద్ధనగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కూరగాయలకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జ్ఞానేశ్వర్ వివరాల ప్రకారం.. బిహార్ దర్భాం గా శివ్‌నగర్‌కు చెందిన రామ్ జతన్ చౌపాల్ (30) మూడు నెలల క్రితం నగరానికి వలసవచ్చి భార్య, పిల్లలతో కలిసి చిలకలగూడ దూద్‌బావిలో నివాసముంటున్నాడు. రామ్ జతన్ చౌపాల్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 18న మధ్యాహ్నం 2గంటలకు కూరగాయలు తీసుకురావటానికి బయటకు వెళ్లిన చౌపాల్ తిరిగి ఇంటికి రాలేదు. పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. భర్త కనిపించటం లేదని భార్య పింకి దేవి మంగళవారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కె.వంశీప్రసాద్

మోసాలు చేస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలి

పంజాగుట్ట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గుర్తింపులేని కోర్సులను ప్రవేశపెడుతూ విద్యార్థుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్న సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అలైడ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. వంశీప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి వెంకటేష్, ఎం.రాములు, మోసపోయిన విద్యార్థి తల్లి కె.దేవదీపికలతో కలిసి ఆయన మాట్లాడారు. అమృత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ మెడికల్ సైన్సెస్, సిగ్మా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ మెడికల్ సైన్సెస్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ మెడికల్ సైన్సెస్, కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ మెడికల్ సైన్సెస్, సిరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ అలైడ్ హెల్త్ సైన్సెస్ సహా మరికొన్ని సంస్థలు విద్యార్థులను మోసం చేస్తున్నాయన్నారు. సుమారు ఐదు వేల మంది ఇక్కడ చేరారని, వారు కట్టిన వేల రూపాయల ఫీజులను తిరిగి ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కోర్సుల పేరుతో మోసాలకు పాల్పడుతున్న సంస్థలను గుర్తించి సీజ్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

ఖైరతాబాద్ అభివృద్ధికి రూ.35 కోట్ల నిధులు

- ఎమ్మెల్యే దానం నాగేందర్



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం రూ.35 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే దానం నాగేందర్ వెల్లడించారు. బుధవారం బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జలమండలి, జీహెచ్ఎంసీ, ఎంటమాలజీ, పారిశుధ్య విభాగం, ఎడ్యుకేషన్ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలమండలి ఆధ్వర్యంలో నియోజకవర్గం పరిధిలో రూ.11.9 కోట్లతో తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ పనులతో పాటు వరదనీటి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.24 కోట్లు మంజూరయ్యాయన్నారు. మొత్తం రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులకు ఇప్పటికే ప్రతిపాదనలు రూపొందించామని, అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. బస్తీ నేతలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు తమ పరిధిలోని సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకువచ్చారని, త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే దానం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం, సెక్షన్ మేనేజర్లు రాంబాబు, శివకుమార్, జీహెచ్ఎంసీ సర్కిల్-17 ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఈఈ విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు నర్సింగ్‌రావు, భారతీనాయక్ పాల్గొన్నారు.

'స్వదేశీ' విధానంతో స్వయం సమృద్ధి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



స్వదేశీ మేళాను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

పంజాగుట్ట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ అనేది కేవలం ఆర్థికపరమైన విధాన కాదని.. ఇది స్వయం సమృద్ధికి తారక మంత్రమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన స్వదేశీ మేళాను గవర్నర్ జిష్ణుదేవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా స్వదేశీ జాగరణ మంచ్ స్థానిక కళాకారులను, స్థానిక ఉత్పత్తులను, స్థానిక వ్యాపారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. స్వదేశీ వస్తువులను కొనుగోలు చేసి వినియోగించడం వల్ల దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ మేళాలో 350 స్టాల్స్‌ను ఏర్పాటు చేయగా, ఈ నెల 27 వరకు మేళా కొనసాగనుంది. ఈ క్యాక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ జాతీయ కన్వీనర్ సి.ఎ. ఆర్.సుందరం స్వదేశీ జాగరణ మంచ్ తెలంగాణ కన్వీనర్ హరీశ్‌బాబు, గంగోత్రి డెవలపర్స్ సీఎండీ మధురాం రెడ్డి, స్వావలంబి భారత్ అభియాన్ కన్వీనర్ జి.రమేష్‌గౌడ్, స్వదేశీ మేళా కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

లంబాడీలపై కాంగ్రెస్ పార్టీ వివక్ష చూపుతోంది

- లంబాడీ హక్కుల పోరాట సమితి



సమావేశంలో అభివాదం చేస్తున్న లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు

పంజాగుట్ట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): లంబాడీలపై కాంగ్రెస్ పార్టీ వివక్ష చూపుతోందని లంబాడీ హక్కుల పోరాట సమితి నేతలు ఆరోపించారు. లంబాడీలు మాట్లాడే గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని, జీవో 29 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాంబల్‌నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సమితి జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంబల్‌నాయక్ మాట్లాడుతూ.. సమితి జాతీయ అధ్యక్షుడు బెల్లయ్యనాయక్ పిలుపుమేరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామని, తమ డిమాండ్ల సాధనకు డిసెంబరు 22న చలో హైదరాబాద్ పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదు వందల జనాభా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా చేయడంతో తమ సామాజిక వర్గానికి చెందిన 3,170 మంది సర్పంచ్‌లుగా ఎన్నికైనట్లు తెలిపారు. తమ ఓట్లతో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తమకు తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఈ సమావేశంలో సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి హరినాయక్, కోట్యానాయక్, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ సక్రు నాయక్, రామునాయక్, చందర్‌నాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఫార్మా ఇండియా ఎక్స్‌పో-2024



ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వదేశీకుమార్, దుండ్ర కుమారస్వామి, డాక్టర్ వినయ్

పంజాగుట్ట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఎగ్జిబిషన్ సర్వీసెస్ ఆధ్వర్యంలో జెనెసిస్ ఇన్ఫర్మేటిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఈ నెల 24, 25, 26 తేదీల్లో ఫార్మా ఇండియా ఎక్స్ పో-2024 నిర్వహించనున్నారు. ఈ ఎక్స్‌పోలో దేశ, విదేశాలకు చెందిన ఫార్మా, హెల్త్ కేర్, టెక్నాలజీ రంగ నిపుణులు పాల్గొంటారని ఇండియన్ ఎగ్జిబిషన్ సర్వీసెస్ సీఈవో స్వదేశీకుమార్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో క్లినికల్ సైంటిస్ట్, జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి, జెనెసిస్ ఇన్ఫర్మేటిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో డాక్టర్ వినయ్, క్లినిసోల్ వ్యవస్థాపకుడు సీఏస్ ముజీబుద్దీన్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఎస్.కె.సైగల్ తదితరులు ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వివిధ అంశాలపై చర్చించనున్నట్లు వారు తెలిపారు

నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తా

- నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వి.నరేందర్‌రావు



మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌రావునాయీ

బేగంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వి.నరేందర్‌రావు నాయీ అన్నారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో జరిగిన నాయీ బ్రాహ్మణ అలయ్-బలయ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణులు చట్టసభలకు ఎన్నికయ్యేలా అన్ని పార్టీలు చొరవ తీసుకోవాలని కోరారు. నాయీ బ్రాహ్మణులు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నప్పటికీ వారికి సరైన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కురు వృద్ధుడు కంది సూర్యనారాయణ, మహేందర్‌నాయీ, వాసునాయీ, సతీష్‌నాయీ, రాచాల సతీష్‌నాయీ, షాద్‌నగర్ రమేష్ పాల్గొన్నారు.



పతకాలతో క్రీడాకారులు

బ్యాడ్మింటన్‌లో పూజ-సాయి జంటకు స్వర్ణం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): స్పోర్ట్స్ ఫర్ ఆల్ చాంపియన్‌షిప్ (ఎస్ఎఫ్ఏ) బాలికల బ్యాడ్మింటన్ డబుల్స్‌లో పూజ-సాయి జోడీ పసిడి పతకం కైవసం చేసుకుంది. బుధవారం యూసఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో బాలికల అండర్-11 డబుల్స్ ఫైనల్లో పూజ-సాయి (సిల్వర్ ఓక్స్ స్కూల్) జోడీ విజేతగా నిలిచింది. బాలుర అండర్-13 డబుల్స్‌లో ధీరజ్-ధర్‌షీల్ ద్వయం (ఆర్బర్ ఇంటర్నేషనల్ స్కూల్) టైటిల్ దక్కించుకుంది. వాలీబాల్ అండర్-12 బాలికల విభాగంలో ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ జట్టు విజేతగా నిలిచింది.

ఉద్యోగాల పేరుతో రూ.26 లక్షలు కొట్టేశాడు



శ్రీరాంకిరణ్

బంజారాహిల్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి వద్ద రూ.26 లక్షలు తీసుకుని మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ స్రవంతినగర్‌కు చెందిన అరెవరపు వాసు టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. తనకు చల్లా శ్రీరాంకిరణ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. టీసీఎస్, ఐబీఎం వంటి కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి వాసుకు చెప్పడంతో తన స్నేహితుల నుంచి రూ.26 లక్షలు వసూలు చేసి శ్రీరాంకిరణ్, అతడి భార్య సంధ్యారాణి ఖాతాల్లోకి నగదు జమచేశాడు. దీంతో గత ఫిబ్రవరిలో ఉద్యోగంలో చేరేలా నకిలీ కాల్ లెటర్లను శ్రీరాంకిరణ్ వారికి పంపించాడు. అయితే ఆఫీసుల వద్దకు వెళ్లి ఆరా తీయగా అవి నకిలీవని తేలింది. అప్పటి నుంచి డబ్బులు తిరిగిచ్చేయాలని వాసుపై తన స్నేహితులు ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో శ్రీరాంకిరణ్ తన స్నేహితులను మోసం చేశాడని జూబ్లీహిల్స్ పోలీసులకు వాసు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు.

ఆన్‌లైన్ పెట్టుబడి పేరుతో రూ.3.60లక్షలు లూటీ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్లో ఆన్‌లైన్ పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని మహిళను నమ్మించిన కేటుగాళ్లు రూ.3.60లక్షలు కొట్టేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 32 ఏళ్ల మహిళకు గుర్తుతెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేసి ఎం-స్టాక్ మ్యాక్స్ అనే ఆన్‌లైన్ స్టాక్ మార్కెట్ సంస్థ నుంచి మాట్లాడుతున్నానని, పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని చెప్పాడు. దీంతో ఆమె విడత వారీగా రూ.3.60 లక్షల పెట్టుబడి పెట్టింది. ఈ డబ్బులు ఐపీఓకు వెళ్లాయని, 15 రోజుల్లో విత్‌డ్రా చేసుకోవచ్చని, ప్రాసెస్ కోసం మరికొంత డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో బాధితురాలికి అనుమానం వచ్చింది. దీంతో ఆమె సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలో టీపీసీసీ చీఫ్ పూజలు



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి

బంజారాహిల్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయంలో బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. ఆయనకు నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం పీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి అమ్మవారి చిత్రపటాన్ని మహేష్‌కుమార్‌కు అందజేశారు.

ఆకట్టుకున్న 'ది పర్పుల్ పాప్‌అప్' ఎగ్జిబిషన్



ఉత్పత్తులను పరిశీలిస్తున్న పైడి సుచరితారెడ్డి


బంజారాహిల్స్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10 లోని జామున్ స్పేస్‌లో బుధవారం ది పర్పుల్ పాప్ అప్ పేరుతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ముంబై, ఢిల్లీ నగరాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన వస్త్ర ఉత్పత్తులను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించినట్లు నిర్వాహకులు పైడి సుచరితారెడ్డి, శ్రీజ తెలిపారు. ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో చదువుకున్న డిజైనింగ్ విద్యార్థుల ఉత్పత్తులను సైతం ఈ ప్రదర్శనలో ఉంచినట్లు వెల్లడించారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత మొత్తాన్ని గూండా ఈశ్వర్ ఫౌండేషన్, పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్‌ల ద్వారా పేద విద్యార్థుల చదువులు, వైద్యం కోసం ఖర్చు చేస్తామన్నారు.

కుటుంబ సభ్యులకు భారం కాకూడదని 95 ఏళ్ల వృద్ధురాలి ఆత్మహత్య

చిక్కడపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబసభ్యులకు భారం కాకూడదని 95 సంవత్సరాల వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి. రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌లోని దీక్షిత అపార్ట్‌మెంట్స్‌లో సరోజినీదేవి(95) నివసిస్తున్నారు. ఆమె భర్త గతంలోనే చనిపోయాడు. ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. ఒక కుమారుడు అమెరికాలో ఉంటారు. మరో కుమారుడు సరోజినీదేవి ఇంటికి సమీపంలోనే మరో అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. సరోజినీదేవిని చూసుకోవడానికి సహాయకురాలిని ఏర్పాటు చేశారు. కుటుంబసభ్యులు కూడా వచ్చి ఆమె బాగోగులు చూస్తుంటారు. రెండురోజుల నుంచి సహాయకురాలు పనిలోకి రావడంలేదని సమాచారం. బుధవారం సరోజినీదేవి అగ్గిపెట్టెతో చీరకు నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంట్లోనుంచి పొగలు వస్తుండడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి 80 శాతం కాలినగాయాలు కావడంతో ఆమె అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. కుటుంబసభ్యులకు భారం కాకూడదనే సరోజినీదేవి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపారు.

సరికొత్త డిజైన్ 'పరగమంజరి'

- ఓయూ బోటనీ విభాగం ప్రాజెక్టు వర్క్‌లో ఆవిష్కరణ
- పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు



కొత్తగా రూపొందించిన డిజైన్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): పువ్వుల పుప్పొడి స్వరూపంలోని సంక్లిష్టమైన అందాన్ని వస్త్ర రూపకల్పనలో పొందుపరిచి 'పరగమంజరి' అనే సరికొత్త డిజైన్‌ను రూపొందించినట్లు ఉస్మానియా యూని వర్సిటీ ప్రకటించింది. ప్రసిద్ధిగాంచిన కలంకారి, పోచంపల్లి, ధర్మవరం ఉప్పాడ సంప్రదాయాలకు సమానంగా సరికొత్తగా పరగమంజరి అనే వినూత్న డిజైన్‌ను ఉస్మానియా యూనివర్సిటీలోని బోటనీ విభాగం ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా తీసుకొచ్చింది. ఈ సరికొత్త డిజైన్ కొత్త తరానికి అద్భుతమైన దుస్తులను ఉత్పత్తి చేయడానికి దోహదపడుతుందని ఓయూ బోటనీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అల్లం విజయ భాస్కర్ రెడ్డి, ఎంఎస్సీ విద్యార్థిని శివానీనేత తెలిపారు. ఈ అంశానికి పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశామన్నారు. పరగమంజరి వస్త్ర, డిజైన్ పరిశ్రమలపై గణనీయమైన ప్రభావం చూపుతుందని భావిస్తున్నామని తెలిపారు. ఇది పుప్పొడి అలంకార నమూనాల నుంచి తీసుకున్న ప్రత్యేకమైన ప్రేరణనని, ఈ అంశాలను టెక్స్‌టైల్ డిజైన్‌లో ఏకీకృతం చేయడం ద్వారా పరగమంజరి టెక్నాలజీ ని పాఠ్యాంశాల్లో చేర్చే అవకాశం ఉందన్నారు.


ఆలయంలో ఫౌండర్స్, బస్తీ వాసులతో మాట్లాడుతున్న శైలజ

ముత్యాలమ్మ ఆలయ పునరుద్ధరణ పనులు చేపడతాం

● దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజ

రెజిమెంటల్ బజార్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయంలో పనులు కొనసాగుతున్నట్లు దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజ తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయాన్ని ఆమె సందర్శించి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధ్వంసం అయిన అమ్మవారి విగ్రహం స్థానంలో పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఫ్లోరింగ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపన సమయంలో చండీయాగం, యాగాలు నిర్వహిస్తామని తెలిపారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఫ్లోరింగ్, గ్రానైట్, ద్వారాలు, పెయింటింగ్, గ్రిల్స్, మందిరం పనులు చేస్తామని తెలిపారు. దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి, సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి, నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాల్ తదితరులు పాల్గొన్నారు.

కుమారుడితో తల్లి అదృశ్యం


శర్వాణితో మోక్షిత్

బౌద్ధనగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నర బాబుతో కలిసి తల్లి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధి లో జరిగింది. ఎస్సై సబిత తెలిపిన వివరాల ప్రకారం.. కిక్కురే శర్వాణి (24)కి 2020లో సురేష్‌తో వివాహం జరిగింది. వీరికి మోక్షిత్ ఏడాదిన్నర బాబు ఉన్నాడు. వీరు శ్రీనివాస్‌నగర్ లో నివాసముంటున్నారు. మంగళవారం శర్వాణి ఇంటికి తాళం వేసి ఉందని బంధువుల అమ్మాయి శర్వాణి అన్నయ్య రామారావుకు తెలిపింది. రామారావు వెంటనే శర్వాణికి ఫోన్ చేయగా బాబుతో వెళ్లిపోతున్నానని, ఇక రానని ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. దీంతో మంగళవారం రాత్రి తన చెల్లెలు, బాబు కనిపించడం లేదని రామారావు చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం


మహాలక్ష్మి (ఫైల్)

బౌద్ధనగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బయటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సబిత వివరాల ప్రకారం.. చిలకలగూడ కిందిబస్తీకి చెందిన సీహెచ్.మహాలక్ష్మి (23) నగరంలో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఈనెల 22న ఉదయం 9గంటలకు ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. మహాలక్ష్మి కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. దీంతో తల్లి ప్రమీల తన కుమార్తె కనిపించడం లేదని బుధవారం చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయలకు వెళ్లిన వ్యక్తి మిస్సింగ్


రామ్ జతన్ చౌపాల్ (ఫైల్)

బౌద్ధనగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కూరగాయలకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జ్ఞానేశ్వర్ వివరాల ప్రకారం.. బిహార్ దర్భాంగా శివ్‌నగర్‌కు చెందిన రామ్ జతన్ చౌపాల్ (30) మూడు నెలల క్రితం నగరానికి వలస వచ్చి భార్య, పిల్లలతో కలిసి చిలకలగూడ దూద్‌బావిలో నివాసముంటున్నాడు. రామ్ జతన్ చౌపాల్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 18న మధ్నాహ్నం 2గంటలకు కూరగాయలు తీసుకురావటానికి బయటకు వెళ్లిన చౌపాల్ తిరిగి ఇంటికి రాలేదు. పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. భర్త కనిపించటం లేదని భార్య పింకి దేవి మంగళవారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లలిత కళాసమితి ప్రధాన కార్యదర్శి ఆకస్మిక మృతి


చాంద్ భాషా (ఫైల్)

చిలకలగూడ, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్, లలిత కళాసమితి ప్రధాన కార్యదర్శి యస్.కె. చాంద్ భాషా (54) అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. భాషా రైల్‌నిలయంలో పర్సనల్ విభాగంలో విధులు నిర్వహిస్తూ లలిత కళాసమితి ప్రధాన కార్యదర్శిగా నాలుగేళ్లుగా సాహిత్య, సంగీత, నృత్య ప్రదర్శనల నిర్వహణతో పాటు సమితి సభ్యులకి ఆటల పోటీలు, నాటక ప్రదర్శనలకి కృషి చేశాడు.

ఆయన ఆకస్మిక మృతికి సమితి పూర్వ కార్యదర్శులు మంత్రి భుజంగరావు, కె.వి బాలాజీ రావు. కార్యవర్గ సభ్యులు భువనేశ్వరి, గోవిందరావు, శ్రీకంఠ హనుమంత రావు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంగళవారం బాపట్లలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఎన్నాళ్లీ నరకయాతన?

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అది సికింద్రాబాద్‌లోని ఓ ప్రధాన ప్రాంతం. ప్రతి రోజు ఈ దారి గుండా వేలాది మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి ఈ ప్రాంతంలో నిత్యం డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. ఏళ్ల తరబడి ఇలాగే కొనసాగుతున్నా పట్టించుకోనేవారే లేరు. అదే సనత్‌నగర్ నియోజకవర్గం, బేగంపేట డివిజన్ ప్రాంతంలోని సికింద్రాబాద్ ప్యారడైజ్ హోటల్ నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు దారి. ఇక్కడ గతంలో ఎంతో పేరుగాంచిన సన్‌షైన్ ఆసుపత్రి, నవోదయ ఆసుపత్రులు ఉండేవి. ఇక్కడ నిత్యం డ్రైనేజీ పారుతుండడం, దానికి తోడు ట్రాఫిక్ సమస్యతో ఆ రెండు ఆసుపత్రులు ఇక్కడి నుండి తరలివెళ్ళి పోయాయి. ఇక్కడ పదుల సంఖ్యలో హోటళ్లు, లాడ్జింగులు ఉన్నాయి. ఎప్పుడో ఏర్పాటు చేసిన మురుగు నీటి పారుదల వ్యవస్థ.. ప్రస్తుతం పదుల సంఖ్యలో ఉన్న లాడ్జింగులు, వ్యాపార సముదాయాలతో ఆ డ్రైనేజీ వ్యవస్థ సరిపోక నిత్యం పొంగి పొర్లుతోంది. గతంలో దీనికి తోడు ఆ ప్రాంతంలో నిత్యం గుంతలు పడుతున్నాయని పాత నవోదయ ఆసుపత్రి ముందు రోడ్డును మరమ్మతు చేశారు. వాటిని వేసేటప్పుడే కొందరు స్థానికులు ఒక్క బ్లాకు ధ్వంసం అయినా మొత్తం కదులుతాయని వాటి వల్ల రోడ్డు యధాస్థితికి చేరుకుంటుందని జీహెచ్ఎంసీ అధికారులకు చెప్పినా..


పాత నవోదయ ఆసుపత్రి ముందు ధ్వంసమైన ఫేవర్ బ్లాక్స్ రోడ్డు

ఆ మాటలను వారు పెడచెవిన పెడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాని మధ్యలో అవి ధ్వంసం కావడంతో పరిస్థితి తిరిగి యధాస్థితికి చేరుకుంది.

కార్పొరేటర్ ఉన్నట్లా.. లేనట్లా?



సంవత్సరాల తరబడి నిత్యం ఇలా మురుగు నీరు పొంగి ఇక్కడి నుండి పీజీ రోడ్డు మమతా స్వీట్ హౌస్ మీదుగా నల్లగుట్ట వరకు ప్రవహిస్తోంది. ఈ దారి గుండా వెళ్లాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి దాపురించింది. జీహెచ్ఎంసీ అధికారులు ఏమీ పట్టనట్లు ఉంటున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యకు తగిన పరిష్కారం చూపాలి.

- మర్రి పురూరవ రెడ్డి, బీజేపీ యువ నాయకులు

వ్యాపార ప్రాంతంగా మార్చడం వల్ల సమస్య



గతంలో నివాస ప్రాంతంగా ఉన్న ఈప్రాంతం ప్రస్తుతం వ్యాపార కేంద్రంగా మారిపోయింది. దానికి తోడు గతంలో ఇక్కడ కొన్ని మాత్రమే లాడ్జింగులు ఉండేవి. ప్రస్తుతం అవి ఎక్కువయ్యాయి. ఎప్పుడో తాతల కాలంలో వేసిన డ్రైనేజీ వ్యవస్థ ప్రస్తుత అవసరాలకు సరిపోయే విధంగా లేవు.

- మాణిక్య బండారం రాజు, టీటీడీపీ

మేమున్నామని.. మీకేం కాదని

● మొండిబండనగర్ బస్తీవాసులకు కాంగ్రెస్ నేతల భరోసా

● రైల్వే అధికారుల నోటీసులకు ఆందోళనలో స్థానికులు

అడ్డగుట్ట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్‌లోని మొండిబండనగర్ బస్తీలో పేదలు దాదాపు 45 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారు. రెండు రోజుల క్రితం రైల్వే అధికారులు గుడిసెవాసుల వద్దకు వచ్చి ఇది రైల్వే స్థలమని మీరు వారం లోగా ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారు. దాంతో బిక్కుబిక్కుమంటూ వారు భయాందోళనకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు రామలీల, భూపతి హరితో పాటు పలువురు నాయకులు బుధవారం మొండిబండనగర్ బస్తీలో పర్యటించి గుడిసెవాసుల నుంచి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఆర్ఆర్‌సీ మైదానాన్ని ఆనుకుని ఉన్న 50 కుటుంబాలు 45 ఏళ్ల క్రితం గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారని, అందరికి ఈ స్థలంపైనే ఆధార్, ఓటర్ కార్డులు ఉన్నా, గుడిసెలు ఖాళీ చేయమంటున్నారని తెలి పారు. ఎవరూ భయపడవద్దని సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్


అడ్డగుట్ట మొండిబండనగర్ బస్తీ వాసులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకురాలు రామలీల

ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ చూసుకుంటాడని కాంగ్రెస్ నేతలు ధైర్యం చెప్పారు. బలవంతంగా రైల్వే అధికారులు ఖాళీ చేయించాలని చూస్తే మారేడుపల్లి తో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న డబుల్ బెడ్‌రూంలను ఇప్పిస్తామని గుడిసెవాసులకు ధైర్యం చెప్పారు.

భయంతో పనికి పోవడంలేదు

- కాంగ్రెస్ నాయకులు

మొండిబండ నగర్ బస్తీలో దాదాపు 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరిలో కొంత మందికి డబుల్ బెడ్ రూంలు వచ్చినప్పటికి అక్కడ సదుపాయాలు లేవు.



ఈ స్థలం ఖాళీ చేయాలని బోర్డు పాతిన రైల్వే అధికారులు

దీంతో కొందరు బయట అద్దెకు ఉంటున్నారు. వారం రోజుల్లో గుడిసెలు ఖాళీ చేయాలని రైల్వే అధికారులు చెబుతున్నారని, వీళ్లంతా పనికి వెళితే ఎప్పుడు వచ్చి కూల్చివేస్తారోనన్న భయంతోనే గుడిసెవద్దే ఉంటున్నారు.

కార్పొరేటర్‌కు చెబితే పట్టించుకోలేదు

- గుడిసెవాసులు

గత 45 ఏళ్లుగా ఇక్కడే ఉంటూ చిన్న చిన్న పనులు చేసుకుంటూ ఉన్నామని, ప్రతి సారీ రైల్వే అధికారులు వచ్చి గుడిసెలు ఖాళీ చేయాలని బెదిరించారు. ఇదే విషయంపై సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు, అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మికి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశాం. మా సమస్యలన్ని వారు పట్టించుకోలేదు. చూస్తాం చేస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారు.

చంపేస్తానని బెదిరిస్తే హత్య చేశా

● పోలీసుల విచారణలో ఒప్పుకున్న నిందితుడు ● సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ హత్య కేసులో అరెస్టు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో ఓ వ్యక్తిని హత్య చేసిన నిందితుడిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావెద్, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్‌ల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గత నెల 21న ప్లాట్‌ఫాం నెంబరు 10 వద్ద ఓ వ్యక్తి హత్యకు గురికాగా ఆ సమయంలో విధి నిర్వహణలో ఉన్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మెట్టపల్లి లక్ష్మీపతి విషయాన్ని గమనించి జీఆర్పీ పోలీసులకు తెలిపారు. విషయం తెలుసుకున్న సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్‌తో పాటు కానిస్టేబుళ్ల బృందం ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అనంతరం రైల్వే పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు సంబంధించిన ఆనవాళ్లు ఘటనా స్థలంలో దొరికిన వస్తువుల్ని రైల్వే పోలీసులు ల్యాబ్‌కు పంపించారు. ఈ క్రమంలో హత్యకు గురైన వ్యక్తి రైల్వే స్టేషన్ లోపలికి ఎక్కడ్నుంచి లోపలికి వచ్చాడు.. ఎవరితో మాట్లాడుతున్నాడన్న కోణంలో రైల్వే పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలించాయి. ఎట్టకేలకు దర్యాప్తు ప్రారంభించిన రైల్వే పోలీసులు చివరికి హత్య చేసింది సికింద్రాబాద్ మెట్టుగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రి వెనుక వైపు రైల్వే క్వార్టర్ ప్రాంతంలో ఉంటున్న సుభాష్ బహేశ్వర్ (39)ను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. హత్యకు గురైన వ్యక్తి నిసాద్ రామ్ సనై బొల్లారంలో ఉంటాడని విచారణలో వెల్లడైంది. హత్యకు గురైన వ్యక్తి తరచూ కొంత కాలంగా డబ్బులు ఇవ్వాలని వేధించడమే గాకుండా ఇవ్వకుంటే చంపేస్తానని బెదిరించేవాడని విచారణలో వెల్లడైంది. హత్య జరిగిన రోజు నిసాద్ రామ్‌కు నిందితుడు ఫోన్ చేసి సికింద్రాబాద్ ప్లాట్ ఫాం నెంబరు 10 లోకి మాట్లాడుతానని చెప్పి అక్కడికి రప్పించాడు. దుడ్డు కర్రతో కొట్టి హత్య చేశాడని రైల్వే పోలీసుల విచారణలో వెల్లడైంది. పోలీసులు నిందితుడిని రిమాండుకు తరలించారు.



హత్య కేసులో నిందితుడి అరెస్టు చూపుతున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు

బాధితులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ : ఎమ్మెల్యే తలసాని

మారేడుపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్ట జే లైన్ కు చెందిన మాధవికి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన 3 లక్షల రూపాయల ఆర్థిక సహాయం పత్రాన్ని (ఎల్ఓసీ)ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.


బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్

మధురానగర్‌లో రోడ్డు పనుల పరిశీలన

బౌద్ధనగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌కాలనీలో ఎస్ఆర్ హస్పిటల్ వెనుకవీధిలో నూతనంగా చేపడుతున్న రోడ్డు పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ, అధికారులతో కలిసి పర్యటించారు. సుమారు ముప్పైలక్షల రూపాయల వ్యయంతో ఈసీసీ రోడ్డు పనులు చేపడుతున్నామని, ఈ నిధులు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరయ్యాయని కార్పొరేటర్ తెలిపారు. బస్తీవాసులకు ఇబ్బందులు కలగకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, నాయకకులు శైలేందర్, జాకీర్, ఆనంద్, అక్రమ్, ఫజిల్, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ, అధికారులు

నాయీబ్రాహ్మణులకు చట్ట సభల్లో అవకాశాలు కల్పించాలి

● రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌రావు నాయీ

బేగంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సంక్షేమంతో పాటు అభివృద్ధికి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కృషి చేస్తుందని తెలంగాణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.వి నరేందర్‌రావు నాయీ అన్నారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో జరిగిన నాయీ బ్రాహ్మణ అలయ్-బలయ్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డి.వి నరేందర్‌రావు నాయీ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు చట్ట సభల్లో ఎన్నికయ్యే విధంగా అన్నీ పార్టీలు అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కురు వృద్ధుడు కంది సూర్యనారాయణ, మహేందర్‌నాయీ, వాసూ నాయీ, సతీష్ నాయీ, రాచాల సతీష్ నాయీ, షాద్‌నగర్ రమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.


అలయ్ - బలయ్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు నరేందర్‌రావు

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మార్కెట్ పోలీసులు తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్‌లో ఫుట్‌పాత్ పై అపస్మారక స్థితిలో పడి ఉండగా వైద్యం కోసం 108 ద్వారా గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి వయస్సు 50-55 మధ్య ఉంటుందని తెలిపారు.


ర్యాలీలో రైల్వే కార్మిక సంఘ్ నేతలు

కార్మికులకు అండగా రైల్వే కార్మిక సంఘ్

● రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైల్వే సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికల్లో రైల్వే కార్మిక సంఘ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. బుధవారం రైల్ నిలయంలోని రైల్వే కమర్షియల్ కార్యాలయంలో రైల్వే సీక్రెట్ బ్యాలెట్‌లో నామినేషన్ వేసేందుకు భారీ ఎత్తున రైల్వే కార్మికులు ఉద్యోగులు తరలివెళ్లారు. అనంతరం ఆయన రైల్వే లేఖా భవన్ వద్ద మాట్లాడుతూ రైల్వే కార్మికుల సమస్యలను డిమాండ్లను పరిష్కరించడంలో కొన్ని సంఘాలు మోసాలకు పాల్పడ్డాయని తెలిపారు. ఈ నామినేషన్‌కు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన యూనియన్ నేతలు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తుల భరతం పడతాం

నేరాలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదు: ఏసీపీ జైపాల్‌రెడ్డి

ఇంటర్వ్యూ...



బౌద్ధనగర్, అక్టోబరు, 23 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్‌జోన్ పరిధి చిలకలగూడ ఏసీపీ కార్యాలయ పరిధిలో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నామని, నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఏసీపీ జైపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల జరుగుతున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకుని లాలాగూడ, చిలకలగూడ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కట్టుదిట్టమైన భద్రతతో పాటు నిఘాను పెంచామన్నారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలుప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

చిలకలగూడ డివిజన్ ఏసీపీ కార్యాలయ పరిధిలో ఎన్ని ఆలయాలున్నాయి?

మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సుమారు నూట ఇరవై ఆలయాలు ఉన్నాయి. ఆలయ కమిటీ సభ్యులు, అందులో పనిచేసే వారితో ఇటీవల సమావేశాన్ని నిర్వహించాం. ఆలయాల వద్ద సెక్యూరిటీతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపాం.

మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాలన్నీ పనిచేస్తున్నాయా?

చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ముఖ్యకూడళ్లతో పాటు పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలన్నీ పనిచేస్తున్నాయి. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడుతున్నాం. సీసీ కెమెరాల ద్వారా అనేకమంది నేరస్థులను పట్టుకున్నాం. అధికారులు, సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉంటున్నారు.

రౌడీషీటర్లపై నిఘా పెడుతున్నారా?

ఇటీవల వారాసిగూడలో ఏసీపీ కార్యాలయం వద్ద ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్యలు మూడు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. వారు నగరం విడిచి బయటకు ఎక్కడకు వెళ్లినా పోలీస్‌స్టేషన్‌లో సమాచారమిచ్చి వెళ్లాలి.

చిలకలగూడ డివిజన్ పరిధిలో నేరాలు పెరిగాయా.. తగ్గాయా?

తగ్గాయి. ప్రధానకూడళ్లతో పాటు బస్తీలు, గల్లీల్లో పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం తిరుగుతూ ఉంటాయి. ఇటీవల చిలకలగూడ పోలీసులు రెండు పెద్ద కేసులను ఛేదించారు. నేరస్థులను పట్టుకుని 26ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌హెచ్ఓ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్‌తో పాటు సిబ్బందిని డీసీపీ బాలస్వామి అభినందించి వారికి నగదు రివార్డులను అందజేశారు.

ప్రజలకు మీరిచ్చే సందేశం?

ప్రజలు పోలీసులకు సహకరించినప్పుడే నేరాలను నియంత్రించవచ్చు. ఆయా ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తే వెంటనే 100 కాని, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు కాని సమాచారమివ్వాలి. అపార్ట్‌మెంట్‌ల వద్ద, కాలనీల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. ఆడపిల్లల తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలను గమనిస్తూ ఉండాలి. యువకులు, పిల్లలు గంజాయి బారినపడకుండా చూసుకోవాలి. పిల్లలకు కౌన్సిలింగ్ ఇస్తూ ఉండాలి.

కంటోన్మెంట్ సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ 7వ వార్డు పరిధిలోని లాలామియ బస్తీలో పర్యటించారు. స్థానికుల ద్వారా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలో కొనసాగుతున్న డ్రైనేజీ పైపుల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బోర్డు అధికారులతో పాటు ఇంజనీర్ రాజేశ్వర్ రావు కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో 7వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మురళీ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.


లాలామియ బస్తీలో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్



స్విమ్మింగ్‌లో విజేందర్‌కు 3 స్వర్ణాలు

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ మాస్టర్స్ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ స్విమ్మర్ కున్వార్ సాయి విజేందర్ సింగ్ మూడు స్వర్ణాలు, ఒక రజతం సహా మొత్తం నాలుగు పతకాలు కొల్లగొట్టాడు. సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన ఈ పోటీల్లో విజేందర్ ఫ్రీస్టయిల్ 400 మీటర్లలో స్వర్ణం, 200 మీ., స్వర్ణం, 100 మీ., రజతం, వ్యక్తిగత మెడ్లే 200 మీ., స్వర్ణం సొంతం చేసుకున్నాడు.

ఇలాంటి వారికి శిక్షలు కఠినంగా ఉండాలి: రంగరాజన్


రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం చేయడం క్షమించరాని నేరమని చిలుకూరి బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయాలపై దాడులకు దిగుతున్న వారిపై కఠినమైన శిక్షలు తీసుకోకపోవడం వలన దాడులు జరుగుతున్నాయని అన్నారు.


ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు రంగరాజన్

సరికొత్త డిజైన్.. 'పరగమంజరి'

● ఓయూ బోటనీ విభాగం ఆవిష్కరణ

● పేటెంట్ హక్కు కోసం దరఖాస్తు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పువ్వుల పుప్పొడి స్వరూపం లోని సంక్లిష్టమైన అందాన్ని వస్త్ర రూపకల్పనలో పొందుపరిచి 'పరగమంజరి' అనే సరికొత్త డిజైన్‌ను రూపొందించినట్లు ఉస్మానియా యూనివర్సిటీ ప్రకటించింది. ప్రసిద్ధిగాంచిన కలంకారి, పోచంపల్లి, ధర్మవరం ఉప్పాడ సంప్రదాయాలకు సమా నంగా సరికొత్తగా పరగమంజరి అనే వినూత్న డిజైన్‌ను ఓయూ బోటనీ విభాగం ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా తీసుకొచ్చింది. ఈ సరికొత్త డిజైన్ కొత్తతరానికి అద్భుతమైన దుస్తులను ఉత్పత్తి చేయడానికి దోహదపడుతుందని ఓయూ బోటనీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అల్లం విజయ భాస్కర్ రెడ్డి, ఎంఎస్సీ విద్యార్థిని శివానీ నేత తెలిపారు. ఈ సరికొత్త అంశానికి పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశామన్నారు. పరగమంజరి వస్త్ర, డిజైన్ పరిశ్రమలు రెండింటిపై గణనీయమైన ప్రభావం చూపుతుందని భావిస్తున్నామని తెలిపారు. పుప్పొడి అలంకార నమూనాల నుంచి తీసుకున్న ప్రత్యేకమైన ప్రేరణ అని, సహజమైన సూక్ష్మ మూలకాలను వస్త్ర రూపకల్పనలో చేర్చడం ఇదే మొదటిసారని తెలిపారు. ఈ శాస్త్రీయ అంశాలను టెక్స్‌టైల్ డిజైన్‌లో ఏకీకృతం చేయడం ద్వారా పరగమంజరి భవిష్యత్ టెక్స్‌టైల్ టెక్నాలజీ పాఠ్యాంశాల్లో చేర్చడానికి మార్గం సుగమం చేస్తుందన్నారు.